కథలు :

# వార్త

సుబ్బారావు

సాయంకాలం మూడు గంటలు. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు వుక్కిరిబిక్కిరిగా వుంది. వాతావరణం "తుఫాను" ముందరి ప్రశాంతతలా వుంది.

కాస్త కాఫీ తాగుదామని ముందుగదిలో కూర్చున్నాను. సుడిగాలి రివ్వున వీచినట్లు పరుగెత్తుకొచ్చాడు మూర్తి. 'పోతుగడ్డలో కాల్పులు జరిగాయట విన్నావా?' అన్నాడు వస్తూనే. అదిరి పడ్డాను. ఆయాసపడ్తూ కుర్చీలో కూలబడ్డాడు మూర్తి. వాడికో కాఫీ కప్పందిస్తూ, 'ఎందుకట?' అన్నాను ఆశ్చర్యాన్నీ, ఆత్రాన్నీ సాధ్యమైనంతగా అణచుకోడానికి ప్రయత్నిస్తూ. పోతుగడ్డలాంటి మారుమూల గ్రామంలో కాల్పులు జరగడమంటే, నాలాంటి సగటు మనుషులకెవరికైనా ఆశ్చర్యం కలగక మానదుమరి.

స్థిమితంగా కూర్చుని మొదలెట్టాడు మూర్తి. "పోతుగడ్డ ఆ చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయకూలీలెక్కువ. వాళ్ళకు మరో జీవనాధారంలేదు, వ్యవసాయప్పనులు తప్ప. అక్కడే వేలాది ఎకరాల భూస్వాములూ, కోట్లాది నల్ల, తెల్ల ధనానికి అధిపతులూ వున్న సంగతి మనకి తెలియందికాదు. ఈ యేడాది 'వూడ్పులు' ప్రారంభం కాగానే కూలీలంతా కల్సి, నిత్యజీవితావసర వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయి గనక మా కూలిరేట్లుకూడా ఇదివరకట్లా రూపాయిన్నరా, రెండూ కాకుండా, ఐదురూపాయలివ్వాలని భూస్వాముల్నడిగారు. కూలివాళ్ళ కష్టంమీద కోట్లు కూడబెట్టినవాళ్ళంతా, అందుకెంతమాత్రం ఒప్పుకోలేదు. పైపెచ్చు కూలోళ్ళకి సంగాలేంటిపొండ్రా అన్నారు. మీరెలా పన్జెయ్యరో మేం జూస్తాంలే అన్నారు. ఎధవ్వేసాలేస్తే, సున్నంలోకి ఎముకల్లేకుండా పొడిపిస్తామన్నారు. వాళ్ళకష్టం మీద బతుకుతూ వాళ్ళచేత తొక్కిపట్టి పన్జెయ్యించుకోవాలనుకుంటే, ఎప్పుడూ వాళ్ళని కాళ్ళకింద చెప్పుల్లాగే వుపయోగించుకుంటే, ఎప్పుడూ వాళ్ళనే బెదిరిస్తుంటే, చెప్పులకైతే చైతన్యం వుండకపోవచ్చుగాని, మనిషన్నవాడు ఎంతకాలమని భరిస్తాడు? వాళ్ళంతా గత్యంతరంలేక సమ్మెకుదిగారు. భూస్వాములంతా దూరవూళ్ళనుంచి, మనుషుల్ని పిలిపించుకొని, పన్లు జరిపించుకోవాలని ప్రయత్నించారుగాని, ఈ సంగతులన్నీ తెలిశాక వాళ్లూ పోయారు. మరీ లోగా ఏం జరిగిందో తెలియదుగాని, ఇదుగో యిప్పుడీ వార్త తెలిసింది" అంటూ ముగించాడు మూర్తి. తనకు తెలిసిందంతా చెప్పేశానన్నట్లు ముఖం పెట్టి.

ఇంకా పూర్తి వివరాలు తెల్సుకోవాలనిపించింది నాకు. మూర్తిని పంపేసి, వూరిమీదపడ్డాను. కూరగాయలు బేరంచేస్తూ అప్పారావు కన్పించాడు. 'పోతుగడ్డలో కాల్పులు జరిగాయట విన్నావా?' అన్నాను.

“అరాచకం, దౌర్జన్యం పెరిగిపోతుంటే, కాల్పులుజరక్క యేంజేస్తాయ్? కూలీవెధవలు కూలీవెధవల్లా పడుండాల. పూటకి గతిలేనివాళ్ళకి సంఘాలెందుకోయ్? 'శ్రమశక్తి', 'దోపిడి' ఏమిటీ పదాలు? కోతకొచ్చిన వెధవలు తుప్పనూర్చుకు పోతామంటే. కష్టపడి భూములు సంపాదించుకున్నవాళ్ళేమయేట్టు? పెద్దపెద్ద భూస్వాములూ వాళ్ళపొలాలూ లేకపోతే, వీళ్ళ బతుకులెలా వెళ్ళమారుతయ్? ఏమైనారావ్! ఈమధ్య ఈ అలగాజనం మితిమీరి పోతున్నారనుకో. వాడు చూడు ఆ కూరలవాడు. వీశ అర్ధ రూపాయికి తెస్తాడు అరవై పైసలంటాడు. ఐదు పైసలు తగ్గించరా అంటే, పెద్ద నీల్గుడు వెధవకి.” ఆగాడు అప్పారావు.

నాకు తెలిసినంతలో అప్పారావు నాలాగే బాధపడుతున్న ఓ మధ్యతరగతి సంసారి. పొలాలూ, మేడలూ ఏమీలేవు. ఏదో వుద్యోగం చేసుకుంటూ బండిలాక్కొస్తున్నాడు. పెద్దపెద్ద షావుకార్ల వద్ద నెల కాతాలున్నాయ్. జీతంరాగానే పద్దులో ఎంతుంటే, అంతా జమకట్టి, ఏ సరుక్కి ఎంత ఎక్కువరేటు వేసినా, మారు మాట్లాడకుండా తెచ్చుకొనే రకం. అలాంటివాడు కూలివాళ్ళ విషయంలోనూ, కూరలవాడి విషయంలోనూ ఇలా మాట్లాడ్డమేమిటో!

ఇక లాభంలేదని బస్‌స్టాప్‌వైపు బయల్దేరాను. అక్కడకూడా అందరూ యీ సంగతులే మాట్లాడుకుంటున్నారు. ఎంతమంది చనిపోయారో, యిప్పుడు పరిస్థితి ఎలా వుందో ఏమీ తెలియటంలేదు- పోనీ నాలుగుమైళ్ళేకదా, ఓసారి వెళ్ళొస్తేనో అనిపించింది. అంతలోనే బస్సొచ్చింది. అనుకోకుండానే ఎక్కి కూర్చున్నాను.

'అమ్మ నాయాళ్ళు! ఈళ్ళకి రేట్లు పెంచాలా? యియ్యాల రేట్లంటారు; రేపు ఎకరాలే పంచియ్యమంటారు. దీన్ని యిప్పుడే ఓ సూపు సూసెయ్యకపోతే, ఇంక మాలాంటోళ్ళంటే, కేరాజాట్ అయిపోద్ది ఈ గాడిదకొడుకులికి. అమ్మో! అమ్మో!!' విచిత్రంగా నోరాడిస్తూ, బొర్రకదలకుండా, చేతులు చిత్రంగా తిప్పుతూ, మాట్లాడుతున్నాడొకాయన. చేతులు తిప్పినపుడల్లా, రవ్వల వుంగరాలు తళుక్కు తళుక్కు మంటున్నాయ్.

'ఏమిచ్చినా ఈ నాలుగురోజులే కదండి నాయుడుగారూ. ఈ మాత్రానికి మీకు పోయీదేముందండె? పాపం! ఇచ్చేత్తే పోనుగదా. పిచ్చిముండాకొడుకులు బంద చేకిరీ చేత్తారు' అంటున్నాడు కండక్టరు.

"ఆకరికి నీకూలిబుద్ధి పోనిచ్చుకున్నావు గాదురో! వున్నట్టుండి. నువ్వో ఎప్పుడో మీ ఓనర్ని ముంచేత్తావ్"

ఆ మాటలకి బస్సంతా గొల్లుమంది. నాకూ నవ్వొచ్చింది. ఓనర్లూ క్లీనర్లూ అని యిన్నిరకాల మనుషులుండకుండా పోయేరోజు రాకపోతుందా! అని.

ఇంతలో పోతుగడ్డ రానేవచ్చింది. బస్సుదిగి వూరిమధ్యగా నడిచిపోతున్నాను. ఈమధ్య నేనక్కడకు పోలేదు. రోడ్డుకు రెండువైపులా ఠీవిగా నిలబడ్డ మేడలు, నేనెక్కువ మేకల్ని తిన్నానంటే, నేనెక్కువ తిన్నానని, గర్వంగా నవ్వుకుంటున్న పులుల్లా, ఒకదానికొకటి పోటీలు పడ్తున్నాయ్. మేడలచుట్టూ కాపలికుక్కల్లా, నిలబడివున్నారు పోలీసులు. ఆ సమయంలో ఆ రోడ్లు అదురుతున్నట్టూ ఆ మేడల పునాదులు కదుల్తున్నట్టూ అన్పించింది నాకు.

గ్రామచావట్లోనుండి కమ్మటి కూరల వాసనలు. పిండివంటల ఘుమ ఘుమలూ అక్కడి వాతావరణాన్ని ఓ విధమైన మత్తులో ముంచేస్తున్నాయి. అసలైనమాంసాన్ని మెకాలుతినిపోగా, ఎముకలతో తృప్తిపడ్డ నక్కల్లా, మూతులుతుడుచుకుంటూ బయట కొస్తున్నారు జవాన్లు.

పంటకాల్వ వంతెనమీద నడుస్తున్నాను. కొలిమిలోనుండి అప్పుడే బయటికి తీసిన ఇనుపగుండులా వున్నాడు సూర్యుడు. ఆ సాయంకాలపు నీరెండకి కాలవలో నీళ్లు మెరుస్తున్నాయి. కాలవదాటి పేటలో ప్రవేశించాను.

అక్కడిళ్ళన్నీ చాలాభాగం పూరిగుడిసెలు. వాటిల్లో ఎక్కువ భాగం వాళ్ళజీవితాల్లాగే శిథిలమైపోయినయ్. ఏకొంపలోనూ నిప్పురాజుతున్నట్టులేదు. ఏ యింటిపైనా పొగవచ్చిన జాడైనాలేదు. కాని అక్కడి మనుషుల్నిచూస్తే, ప్రతివాడికళ్లూ పొగలూ సెగలూ కక్కుతూనే వున్నాయనీ, ప్రతి వ్యక్తి గుండెల్లోనూ నిప్పురాజుతూనే వుందని స్పష్టంగా తెలుస్తూనేవుంది. వాళ్ళంతా కన్నుల్లో ప్రతీకారజ్వాలలతో, మూర్తీభవించిన నిశ్చయాల్లా, ఎక్కుపెట్టిన విల్లుల్లా, గురిపెట్టిన తుపాకుల్లావున్నారు.

ఓ ఇంటిముందు చాలామంది కూర్చుని, ఏవో తర్జనభర్జనలు చేసుకుంటున్నారు. కొంతమంది కాళ్ళకూ, చేతులకూ చిన్న చిన్న కట్లున్నాయ్. ఇద్దరు ముగ్గురు తెలిసినవాళ్లు కనిపిస్తే అక్కడికి పోయి కూర్చున్నాను. అప్పటికే వాళ్లంతా ఓ నిశ్చయాని కొచ్చినట్టు కన్పించారు. పక్కనున్న స్నేహితుణ్ణడిగాను. 'ఎలాజరిగింది' అని. నా మాటలు విన్న ఓ ముసలాయన చెప్పటం మొదలెట్టాడు.

"ఏం చెప్పమంటావు బాబూ! మేం కూలిమ్మన్నాం గాని, ఆశ్లెకరలేమ్మన్నామా? మా రెక్కలు ముక్కల్జేసుకున్నా, మా డొక్కలు నిండటంలేదు, మాసీమూ

నెత్తురూ ఎరువులుగామార్సి, మీ పొలాలు పండిత్తన్నాం. మా కట్టానికి తగ్గ ఫలవివ్వం డన్నాం అది తప్పా? నువ్వు గొడుగేసుకుని, గట్టునికూకుంటే, మేం సెమటలుకక్కు కుంటూ, ఒళ్లిరగ్గొట్టుకుంటూ పన్జేత్తుంటాం బాబూ! నువ్వెచ్చగా పెళ్ళాంపక్కలో తొంగుంటే, మేమూ మా పెళ్లాలూ ఒంటికి సుకమన్నాదిలేక, కంటికి కునుకున్నాదిలేక, మా కన్నీళ్ళతో మీ పొలాలు తడుపుతున్నాం. పగలనక, రాత్రనక, రాయనక రప్పనక పురుగనక పుట్రనక సంవచ్చరాలతరబడి సేకిరిజేసి, రాసులు పడించి, మీ గాదెలు నింపుతున్నాం బాబూ. మేమింత పన్జేత్తన్నాం, మా కట్టం గమనించండన్నాం. మీరు సోమారిపోతుల్లాగ పరుపుల మీద్దొర్లుతున్నారు. మీరు నల్లుల్లాగ జలగల్లాగ మా మీద బతికేత్తన్నారు. మా కూలికినే యిమ్మన్నామా? మా కట్టానికి యిలవడుగుతున్నాం. అది తప్పైపోయిందా! అదుగో అటుసూడు బాబూ! ఆ పొలాలెలాగున్నాయో?

అటుకేసి దృష్టిసారించాను. ఎప్పుడూ పచ్చపచ్చగా పైరగాలికి పరవశించిపోతూ కళకళలాడే ఆ పొలాలు యిప్పుడు రకరకాల కలుపుమొక్కలు పెరిగిపోయి పాడుపడి పోయినయ్.

చూడు బాబూ అయ్యిప్పుడు పొలాలు కావు. దవిటిపర్రిలు. ఆళ్ళపాలిటి సొపానాలు. అయ్యలా గుండటానికి కారనమేటంటారు? ఈ పెయ్యి పడకపోడమే బాబూ! ఎంత నిగనిగలాడే జుట్టయినా నాలుగు రోజులు నూనెట్టకపోతే ఏమౌద్ది? పువ్వునీళ్లో పొర్లిన గేదె రోమాల్లా ఎర్రబడిపోద్ది. ఎంటిక పెర్రబడిపోతే, ఆడిమొకమేమౌద్ది? ఎదవ రూపొచ్చేత్తాద్ది. ఆడికి సన్నాసి మొకమడిపోద్ది అంతేబాబూ! ఈ పొలాలూ, పుట్రిలూ, తోటలూ, దొడ్లూ యీ కూలోళ్ల కడుపుమంటకి బస్మమై పోవల్సిందే.

ఇప్పుడేమొచ్చింది నీకు? పొలాలు బీడెట్టేసావు. కానీ కలిసొచ్చిందా? పొలాలు బీడెట్టేటాకైనా నీకిట్టమైందగాని, కూలోడికి కూలిపెంచడానికి నీకొప్పుదలవ్వ లేదు. ఎందుకని? మేం కూలోళ్లం. మీరు కామందులు. కూలోడు సెప్పడమేంటి? మే మిస్టమేంటనేకదా? పోనీ మీరనొద్దు మేం పన్జెయ్యమన్నాం. మరి మీకు మా మీద కసెందుకు? మీ దారి మీర్జూసుకోండి. మా దారికి మమ్మల్నొదిలెయ్యండన్నాం. మరలా గొదల్రే? మీ మెప్పుడూ గొర్రెపిల్లలం బాబూ. అల్లెప్పుడూ తోడేళ్ళే. గొర్రెపిల్ల నిజూత్తే, తోడేలు కెప్పుడూ గుర్రేబాబూ!

గొర్రెపిల్ల నీళ్లు తాగుతుంటే, తోడేలేమంది? నేన్తాగే నీళ్ని నువ్వెంగిలిజేత్త న్నావంది. దానికి గొర్రెపిల్ల నీటిపైన్నువ్వు తాగుతున్నావు. కింద నేత్తాగుతున్నాను. నువ్వు తాగిన్నీళ్లేకదా నాకొత్తంట మరిదేం న్యాయమంది. దానికి తోడేలేమంది?

ఎంటనే మాట మార్చేసింది. కొత్తాదు పేసింది. ఆరుమాసాల కితం నువ్వు నన్ను తిట్టావంటకాదా అంది. అప్పుడు గొర్రెపిల్ల నేను పుట్టే మూడు మాసాలైంది కదా : ఇదేమి సిత్రిమని తెల్లమొకమేసింది. నీమాటకెదురానోణ్ణి నువ్వు నాక్కేయ్యాలి. మరింకాదెప్పుడూ పైకి లెగ్గూడదు. ఆయనెవళో అన్నట్టు. సంపేసీముందో పేరెట్టెయ్యాల. అప్పుడు తోదేలేవంది ? నువ్వు తిట్టాపోతే, నీయమ్మైనా తిట్టుంటాదని, మీదపడి, పీక నొక్కేసింది.

ఇప్పుడు నువ్వు సేసీదదేకదాబాబూ! పేదోళ్ళమందరం మీ పనులు సెయ్యమన్నాం. మీకులాసొచ్చింది. మీతోదేలుబుద్ధి బుసకొట్టింది. అందుకనేదోరకంగా. మమ్మల్ని సికించాల. అందుసేత. మీ కుప్పలు తగలబెట్టేత్తన్నామంటన్నారు. మీకొంపలు దోసుకుంటన్నామంటన్నారు. మిమ్మల్ని నిలబడి నీళ్లతాగనియ్యటం లేదంటన్నారు. అలాగని మీరు గవరమెంటోళ్ళని నమ్మింతన్నారు. అదిని గవరమెంటోళ్లేంజేత్తన్నారు ? పోలీపోల్ని. సియ్యార్పీవోళ్ళనీ పంపేతన్నారు. ఆళ్లొచ్చేంజేత్తన్నారు ? నాయమేంటన్నాయమేంటని సూత్తన్నారా ? పూరపందుల్లాగ అన్ని తినిపించీసి తినేసి. దొరికినకాడ్లో ణల్లా వుతికేత్తన్నారు. బొక్కలో తోసేత్తన్నారు."

"కారణాలేమీ చూపించకుండా ఎలా అరెస్టులు చేస్తున్నారు ?" అన్నాను.

"కారణమేంటిబాబూ. సవాలక్షుంటాయ్. కొబ్బరకాయలు కోసేసి, పేసనుకాడ పొయ్యంచేత్తన్నారు. దాన్యం బత్తాలూ. రూపాయిలూ, నగలూ అక్కడ పెట్టేత్తన్నారు. తొంభై తొమ్మిది తప్పుడు కేసులు రాసేత్తన్నారు. ఆళ్ళకత్తి కద్దేముంది.

అన్నీ సయించాం బాబూ అయినా ఆళ్ళకస్తి ర్లేదు. ఆళ్ళ పగ సల్లార్లేదు. ఈ మంటలిలా సుట్టూ రేగిపోయి. ఆళ్ళమీదకి నాలికల్సాసటాన్కి కార్నమైన నుప్పు రవ్వేంటని దుర్భిణీ ఏసారు. అందులో యిదిగీ బాబు కనవడ్డాడు. ఈ కతంతా యీ రాంబాబే నడిపిత్తన్నాడని అళ్ళకెరికే బాబూ !"

అటు చూసాను. ముప్ఫై ముప్పైఐదు సంవత్సరాలున్న ఓ యువకుడు చలాగ్గా బిక్కుపల్చగా చెరగనినవ్వుతో, ఎంతో వినయంగా వాళ్ళమధ్యన కూర్చునివున్నాడు.

ముసలాయన అందుకున్నాడు.

ఆళ్ళ పిచ్చిగానీబాబూ, రాజేసిన నుప్పునీ సేత్తే మాత్రం మంటలారిపోతాయా ? అయినా ఆళ్ళేమనుకుంటారంటే మద్దినున్న పెద్దమోడున్లాగేత్తే, సిల్లరనుప్పుల్మీద నీళ్లసిలికెయ్యొచ్చని అందుకనీ బాబు మీ దేశాలోళ్ళరూపు. మాకు తెల్పుబాబూ. ఒళ్లు కిందనుంచిపైదాకా గడ్డితినిపించేసారు. లచ్చలకిలచ్చలు కర్సైనా యీ శాల్తీని తీసె

య్యాలని అళ్లంతా కూడబలికేసుకున్నారు. మేంకూడా యీ బాబుని కంటికిరెప్పలా కాపాడుకుంటున్నాం. నిన్నిమద్దేణ పేల ఏయోపన్లుమీదలా అలా సెదిరిపోయాం; అది కనిపెట్టేసారాళ్లు.

పీనన్నానని నీకొక్కప మొద్దు. నీది గవరమెంటు. నీకు బోల్డు సట్టాలున్నాయి. అతికారాలున్నాయి. దర్జాగా వారంటట్టుకొచ్చి అరెట్టు సేసుకెళ్ళొచ్చు. అలాటప్పుడా దొంగబతుకెందుకు? నక్కి కోడిపుంజుని లటక్కన కరుసుకుపోయినట్టు అట్టుకుపోతావా? పోనీ ఎలాగో లాక్కుపోయావ్. లాక్కుపోయినోడివి రాజబాటని సేసన్కి తీస్కుపోక, నీకడివిదారెందుకు? అడివిలోకి తీసుకుపోయేంజేద్దామని?

ఈ కపురెలాగో మాకందింది: సేలికందిందలా పుచ్చుకుని పరుగెత్తాం. పుల్లలు నరుక్కునీవోళ్లు అడివిలోనే అడ్డేసారు. ఆడకూతుళ్ల కారంబుడ్లుచ్చుకున్నారు. కత్తులూ, కర్రలూ, గొడ్డళ్లూ, గునపాలూ అడ్డమేసాంబాబూ, జనం వందలు, వేలు. అళ్లీ జనం మద్దినిరుక్కుపోయారు. వున్నట్టుండెవడో పైరన్నాడు. ఆడు పైరండమేంటి, ఆడిబుర్ర పగిలిపోడమేంటి రొండూ ఒక్కపాలే జరిగిపోయాయి. ఈ అవిడిలో మా'బాబు'ని పట్టుకున్నావోడు పిస్తోలు గురిపెట్టేసాడాబాబుకి. అది సూసినొకాడకూతురు ఏసిందిబాబూ ఆడి గుత్తిమీద. దెబ్బతో గుత్తి రిగిపోయింది. అదెవరసని ఆడకూతుళ్లు కారంబుడ్లు గురెట్టేసారు, సూడాలబాబూ అళ్ళదైర్నమప్పుడు. దణ్ణం రెట్టేసారు. టోపీలూడిపోయీ, బూట్లు జారిపోయీ ఒకేచేపరుగు."

మునలతను కొంచెంసేపాగాడు. వున్నట్టుండి అతనిముఖంలో విషాదచ్ఛాయలు కన్పించినవ్. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

సెమించెయ్యడమన్నది మాచెడ్డధి బాబూ. సెత్రువు నీ సేతికిసిక్కితే సఫా సేసెయ్యటమేగాని, సెమించకూడదు. సెమించావంటే నువ్వు దెబ్బతినేసావన్నమాటే, మావోళ్లు సేసిందదేబాబూ! అళ్ళని కొట్టేయి, కుక్కల్ని కొట్టేయని బయల్దేరొచ్చేత్తన్నాం.

ఉన్నట్టుండి ఎనకాల తుపాకులు పేలినియ్యి. బిడ్డలు పిట్టల్లా రాలిపోయారు. సేనామందికి రవ్వలు తగిలాయి. జనమంతా పుల్లెనక్కి తిరిగేసరికి పారిపోయారు.

ఇంక సివరగా నీకోసంగతిసెప్పాల. మేం కూలి పెంచమన్నాం, నువ్వునసేమిరా అన్నావ్. మేం సమ్మెజేత్తే, నువ్వు పోలీసుల్ని తెచ్చావ్. అళ్ళకి పలావులూ పాయసాల్తో తెగమేపుతున్నావు. మా నాయకుణ్ణి తీసెయ్యటాకి లచ్చలకిలచ్చలు కర్సుపెడ్తున్నావు. అళ్ళకి కర్సుపెట్టేదాంట్లో పదోవొంతుకూడా మా కూలికి కర్సవ్వదు. అయినా నువ్వాళ్ళనే మేపుతావుగాని, కూలోడికి కానీ యిదవవు. పైపెచ్చు మీవోళ్ళం

290

దర్నీ పోగేసుకుంటున్నావు. ఉన్నోళ్లున్నోళ్లా ఒకటైతే, మరి లేనోళ్ళేంజెయ్యాల? ఎక్కడెక్కడున్నా అళ్లూ ఒకటవ్వాల. తాడోపేడో తేలిపోవాల. పేణాలు పోయినా పట్టిన కర్ర ఒదిలేదికల్ల. సివరివూపిరిదాకా పోరాడే తీకతాం. అదే అన్నాట్లకీ పరిస్కారం అళ్లసావు నాళ్ళే కొనితెచ్చుకుంటన్నారు.

ఆ మాటలంటూ అతను వుద్రేకంతో వూగిపోతున్నాడు. ప్రతీకారంతో నేత్రాలు అరుణారుణమైనాయి. పోతుగడ్డ పీడితలోకాన్ని ఎలుగెత్తి పిలుస్తున్నది.

మర్నాడు పేపర్లో వార్త.

"పోతుగడ్డలో పోలీసు కాల్పులు. ఒకని మృతి. ఒక యస్సైతోసహా పలువురి పోలీసు సిబ్బందికి గాయాలు. కూలీలను అపహరించడం, భూస్వాములపై పోలీసులను రెచ్చగొట్టడం, దోపిడీలు, హత్యలు మొదలైన హింసాయుత కార్యక్రిమాల్లో బహిరంగంగా నిమగ్నమైవున్న రాంబాబు అనేవ్యక్తిని పోలీసు అరెస్టుచేసి తీసుకువస్తుండగా అతన్ని విడిపించుకుపోవడానికి ఒక గుంపు కత్తులు, గొడ్డళ్లు, గునపాలు మొదలగు మారణాయుధాలతో పోలీసులపై దౌర్జన్యానికి దిగినప్పుడు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించి ఫలితంలేక, ఆత్మరక్షణార్థం తప్పనిసరిగా పోలీసులు కాల్పులు జరపవలసివచ్చినట్లు ఇక్కడి పోలీసు కేంద్ర కార్యాలయానికి అందిన వార్తల వల్ల తెలియవచ్చింది:"

వార్త చూసి నేను విస్తుపోయాను.

ఆ వార్తనిబట్టి నా కర్థమైందేమిటీ అంటే ప్రజాస్వామ్యంలో కూలి, నాలి జనం శాంతికి భంగం కలిగిస్తారు. భూస్వాములు శాంతికాముకులుగనుక ప్రభుత్వం శాంతిని పరిరక్షించటానికి పోలీసులను వారికి సాయంపంపిస్తుంది. ప్రజలు దౌర్జన్యానికి దిగుతారు. పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరుపుతారు. దేశాన్ని నిత్యం ప్రగతిపథంలో మళ్ళించడానికి పాటుపడే మన పత్రికలు పోలీసుల సాయంతో నమ్మకమైన వార్తల్ని ప్రకటించి దేశానికెంతో మేలుచేస్తాయి!

[పల్లంకుర్తిలో జరిగిన కూలిపోరాటాన్ని ఆధారంగా తీసుకొని, దానికి వర్గదృక్పథంతో రూపకల్పనచేసి, పరిష్కారాన్ని సూచించాను. — రచయిత]

---

'మేము ప్రపంచ విప్లవంకోసం పనిచేస్తున్నాం. మేం మాకోసం మాత్రమే, మా సామూహిక జీవితం కోసం మాత్రమే, చైనా కోసం మాత్రమే కాదు. ప్రపంచ ప్రజల స్వేచ్ఛకోసం పనిచేస్తున్నాం. దేశ దేశాల ప్రజల పోరాటాలు మా భవిష్యత్తు కోసం కూడ సాగుతున్న పోరాటాలుగా మేం భావిస్తాం.'

[ఫెంగ్ వాంగ్-యెహ్, చైనా: రెవల్యూషన్ కంటిన్యూడ్ పేజీ 185]